# కోర్టులు – రిజర్వేషన్లు

ప్రజాస్వామిక వ్యవస్థకు రెండు ప్రధాన లక్షణాలున్నాయి. మొదటిది చట్టబద్ధపాలన. అంటే చట్టం అందరినీ సమానంగా పరిగణించాలి. ఏ

మనిషైనా రుజువు కానిదే శిక్షించడానికి వీల్లేదు. ప్రజాస్వామిక వ్యవస్థ రెండవ లక్షణం ప్రతి మనిషికి తన జీవితాన్ని తన ఇష్టం వచ్చినట్టుగా సాగించడానికి, తనలోని సృజనాత్మక శక్తుల వికాసానికి కృషి చేయడానికి గల స్వేచ్ఛను గుర్తించడం. స్వతంత్ర భారతదేశం ప్రజాస్వామిక వ్యవస్థను ఏర్పాటు చేయదలచి పై విలువల ఆధారంగా ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో పొందుపరిచింది. అయితే ఆచరణలో చట్టం దృష్టిలో సమానంగా పరిగణించబడాలన్నా, స్వేచ్ఛగా జీవించాలన్నా అందుకు అనువైన వాతావరణం కావాలి. ప్రత్యేకించి ప్రతివ్యక్తి తన జీవితంపై తాను పూర్తి అధికారాన్ని కలిగి ఉండాలి. మరో రకంగా చెప్పాలంటే ఈ విలువల ఆధారంగా సమాజం పునర్వ్యవస్థీకరించబడాలి. చాలా మంది రాజ్యాంగాన్ని రాసుకున్న తర్వాత సామాజిక పరిస్థితి దానంతట అదే మారిపోయిందని అనుకొంటారు. చట్టాల వలన, ప్రభుత్వ ఉత్తర్వుల వలన సమాజం మారదు. నిరంతరమైన రాజకీయ ఉద్యమాలే సమాజాన్ని మార్చగలుగుతాయి. చట్టాలను అమలులోకి తేగలుగుతాయి.

మన దేశంలో కులవ్యవస్థ ప్రజాస్వామిక విలువలకు ఒక పెద్ద అవరోధం. కులం కారణంగా మొత్తం జనాభాలో 3/4 వంతు కనీసమైన సౌకర్యాలకు నోచుకోలేక పోయారు. వారిని సమాజం వెలుపలే ఉంచారు. అభివృద్ధి ఫలితాలు కూడా వారికి దక్కనివ్వలేదు. కుల వ్యవస్థ వలన లాభం పొందుతున్న కొందరు ఈ వ్యవస్థను కాపాడాలనీ, దాని ద్వారా తమ పెత్తనాన్ని నిలుపుకోవాలనీ చూస్తారు. మన దేశంలోని మధ్యతరగతి వర్గం ప్రధానంగా అగ్రకులాలకు చెందినవారే కనుక కుల వివక్ష గురించి వారు ఎప్పుడూ పట్టించుకోలేదు. ఇటువంటి సమాజంలో కులవ్యవస్థ నిర్మూలన జరగకుండా ప్రజాస్వామిక విలువలను విస్తృత పరచడం సాధ్యంకాదు.

కులవ్యవస్థను దృష్టిలో ఉంచుకుని, అప్పటికే కులవ్యవస్థకు వ్యతిరేకంగా అంబేద్కర్‌లాంటివారు సాగిస్తున్న పోరాటం వలన రాజ్యాంగం వెనుకబడిన కులాలు, షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించింది. షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ వెంటనే అమలులోకి వచ్చినా వెనుకబడిన కులాలకు ఈ సౌకర్యాన్ని విస్తరించడంలో చాలా జాప్యం జరిగింది. ఇందుకు కారణం రాజ్యాంగం వెనుకబడిన కులాలు అనే మాటకు బదులుగా సామాజికంగా విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు అనే మాటను వాడడం. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గం అంటే ఏమిటి అన్నది తర్కవితర్కాలకు దారితీసింది. వాటిని గుర్తించడానికి కమీషన్లు నియమించబడ్డాయి. అయినా నిన్నమొన్నటి వరకు చాలా రాష్ట్రాలలో, కేంద్రంలో కూడా వాటి గుర్తింపు పూర్తికాలేదు.

వెనుకబడిన వర్గాల జాబితా రూపొందించి రిజర్వేషన్లు ప్రకటించిన ప్రతిసారీ ఎవరో ఒకరు కోర్టుకు వెళ్లడం, జాబితా రాజ్యాంగ బద్ధంగా లేదని సవాలు చేయడం, కోర్టులు కాలయాపన జరిపి తీర్పులివ్వడం జరుగుతూనే ఉన్నది. ప్రతిరాష్ట్రంలోను రిజర్వేషన్ ప్రకటించిన ప్రతిసారీ దాన్ని కోర్టులకు నివేదించడం జరిగింది. ఆ రకంగా కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఉత్తరప్రదేశ్, జమ్ముకాశ్మీర్ మొదలైన రాష్ట్రాల నుంచి కోర్టులలో రిజర్వేషన్లపై పిటీషన్లు దాఖలయ్యాయి. ఇప్పుడు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ మళ్లీ కోర్టుల్లో కేసులు దాఖలయ్యాయి. కనుక ఇంతవరకు రిజర్వేషన్ల సమస్యపై కోర్టులు ఏ దృక్పథాన్ని వ్యక్తం చేశాయనేది తెల్సుకోవడం చాలా అవసరం. కొన్ని ప్రధాన తీర్పులను పరిశీలిస్తే కోర్టుల వైఖరి స్పష్టమవుతుంది.

**బాలాజీ వర్సెస్ మైసూర్ రాష్ట్రం** (1963) కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని కొన్ని అంశాలు ఇప్పటికీ గీటురాయిగా పరిగణించబడుతున్నాయి. ఈ కేసు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. 1962 లో నాగన్నగౌడ్ కమీషన్ సూచనలను అనుసరించి కర్నాటక ప్రభుత్వం మెడికల్ మరియు ఇంజనీరింగ్ కళాశాలల్లో 50 శాతం సీట్లను వెనుకబడిన కులాలకు రిజర్వు చేసింది. అప్పటికి ఎస్.సి. ఎస్.టిలకు కల్పించిన రిజర్వేషన్లతో ఇది 68 శాతానికి పెరిగింది. వెనుకబడిన కులాలను వెనుకబడిన కులాలు, బాగా వెనుకబడిన కులాలు అని రెండుగా విభజించి మొదటి కాటగిరీకి 28 శాతం, రెండవ కాటగిరీకి 22 శాతం రిజర్వేషన్లను కల్పించింది. అయితే ప్రభుత్వం వెనకబాటుతనానికి ఇచ్చిన నిర్వచనం రాజ్యాంగంలోని 15(1) అధికరణానికి విరుద్ధంగా ఉందని బాలాజీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. సుప్రీంకోర్టు తీర్పులోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి –

1. అభివృద్ధి చెందిన సెక్షన్లతో పోల్చిచూసి సాపేక్షంగా వెనుకబడ్డ వాళ్లని వెనుకబడ్డ వర్గాలుగా ప్రకటించడం సరైనదికాదు. రాజ్యాంగం ప్రకారం సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుకబడితేనే వెనుకబడిన వర్గాలుగా గుర్తించాలి. ఏదో ఒక రంగంలో వెనుకబడ్డా అది వెనుకబడ్డ వర్గం కానేరదు. రెండు రంగాల్లో కూడా వెనుకబాటుతనం ఉన్నవే వెనుకబడిన వర్గాలు. వెనుకబడిన వర్గాలను రెండు గ్రూపులుగా విడగొట్టడం వాటి అభివృద్ధిని సాపేక్షంగా పోల్చిచూడటమవుతుంది. కనుక ప్రభుత్వ ఉత్తర్వు సరైనది కాదని కోర్టు అభిప్రాయపడింది. ("In introducing two categories of backward classes what the impugned order, in substance, purports to do is to devise measures for all the classes of citizens who are less advanced compared to the most advanced classes in the state, and that in our opinion is not the scope of article 15(4) ")

2. రాజ్యాంగం వెనుకబాటుతనం అనుభవిస్తున్న గ్రూపులను వర్గాలు అని అన్నది కాని కులం అన్న మాట వాడలేదు. హిందూసమాజంలో వ్యక్తి సామాజిక స్థాయిని ప్రధానంగా కులమే నిర్ణయిస్తుంది. కనుక వెనకబాటుతనాన్ని నిర్ధారించడంలో కులాన్ని ప్రాతిపదికగా తీసుకోవచ్చు; కాని కులాన్ని ఒకానొక ప్రాతిపదికగా మాత్రమే పరిగణించాలి. వెనుకబాటుతనాన్ని నిర్ణయించడంలో కులమనేది ప్రధానమైన కారకం కాకూడదు. (Castes in relations to Hindus may be relevant factor in determining social backwardness of a group of classes of citizens, it cannot be made the sole dominant test in that behalf".)

3. రిజర్వేషన్లు 50% కంటే ఎక్కువగా ఉండకూడదని కోర్టు సూచన చేసింది. (Speaking generally and in a broad way, a special provision should be less than 50%)

ఈ కారణాల వలన కోర్టు కర్నాటక ప్రభుత్వ ఉత్తర్వును కొట్టి

వేసింది. కోర్టు తీర్పును పురస్కరించుకొని మళ్లీ ప్రభుత్వం వృత్తి - ఆర్థిక స్థాయి ఆధారంగా కొత్త సర్వే జరిపి వెనుకబడిన వర్గాల జాబితాను రూపొందించింది. వెనుకబడిన వర్గాలకు మొదటి ఉత్తర్వులో వలె 50% రిజర్వేషన్లు కల్పించింది.

కులాన్ని వెనుకబాటుతనాన్ని గుర్తించడానికి ప్రాతిపదికగా తీసుకోలేదని విశ్వనాథ్ అనే వ్యక్తి మైసూర్ హైకోర్టులో కేసు వేశాడు. వెనుకబాటుతనాన్ని గుర్తించడంలో కులాన్ని ఒక ప్రాతిపదికగా తీసుకోక పోవడం వలన హిందూ సమాజంలో వెనుకబడిన వర్గాలకు న్యాయం చేకూరదని హైకోర్టు మళ్లీ ప్రభుత్వ ఉత్తర్వును కొట్టివేసింది. హైకోర్టు తీర్పును ఛాలెంజి చేస్తూ చిత్రలేఖ సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకొంది. **చిత్రలేఖ వర్సెస్ మైసూర్ రాష్ట్రం** (1964) కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ఈ క్రింది విషయాలను వివరించింది.

1. బాలాజీ కేసులో సుప్రీంకోర్టు వెనుకబాటుతనాన్ని అంచనా వేయడంలో కులాన్ని ఒకానొక కారకంగా పరిగణించ వచ్చునన్నది కానీ ప్రధాన కారకంగా తీసుకోవాలని సూచించలేదు. కులాన్ని తప్పనిసరిగా పరిగణనలోనికి తీసుకోవాలని కూడా బాలాజీ కేసులో సూచించలేదు. అంతేకాక 15(4) ఆర్టికల్ ప్రకారం కులాన్ని పరిగణనలోనికి తీసుకోకుండా వెనుకబాటుతనాన్ని అంచనా వేసినా తప్పేమీకాదు.

2. రాజ్యాంగంలో వర్గం అనేమాట ఉపయోగించారు. అంతేకాని కులంకాదు. కావాలనుకుంటే రాజ్యాంగ నిర్మాతలు వర్గాలులేక కులం అనే వాడిఉండేవారు. అలా వాడకపోగా షెడ్యూల్డ్ కులాలు అనే పదంతోపాటు వెనుకబడిన వర్గాలు అనే పదాన్ని వాడటం వలన కులం మరియు వర్గం రెండూ పర్యాయపదాలు కావనేది స్పష్టం.

అయితే కోర్టు దృక్పథంలో తరువాత కాలంలో కొంత మార్పు వచ్చింది. **పి. రాజేంద్రన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాసు** (1968) కేసులో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు వైఖరి కొంత మారింది.

మద్రాసు ప్రభుత్వం మెడికల్ కళాశాలల్లో వెనుకబడిన కులాలకు రిజర్వేషన్ కల్పిస్తూ ఇచ్చిన ఉత్తర్వును ఛాలెంజి చేస్తూ రాజేంద్రన్ కోర్టులో కేసు వేశారు. ఈ కేసులో తీర్పునిస్తూ కులాల ప్రాతిపదికపై రిజర్వేషను కల్పించినప్పుడు ఆ కులాలు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడినవని రుజువు చేయలేకపోతే అట్టి రిజర్వేషన్లు సమానత్వపు హక్కుకు భంగం కలిగించినట్టేనని కోర్టు పేర్కొన్నది. అయితే కులం కూడా ఒక వర్గమేనని, ఒక కులం మొత్తం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడినట్లయితే ఆ కులానికి రిజర్వేషన్ కల్పించవచ్చునని కోర్టు పేర్కొన్నది. ("........Reservations can be made in favour of a caste on the ground that it is socially and educationally backward classes of citizens with in the meaning of Act. 15 (4) ")

ఈ కోవకు చెందిన మరో కేసు **పి. సాగర్ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.** ఈ కేసులో రాష్ట్ర హైకోర్టు కుల ప్రాతిపదికపై రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్‌ను కొట్టివేసింది. కులాల జాబితాను రూపొందించడంలో ప్రభుత్వం అనుసరించిన ప్రాతిపదిక స్పష్టంగా లేదని కోర్టు అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు కూడా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆమోదించింది. కులాన్ని పూర్తిగా విస్మరించటానికి వీల్లేదని, అయితే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలకు మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలని కోర్టు అభిప్రాయపడింది.

**పెరియకరుప్పన్ వర్సెస్ తమిళనాడు రాష్ట్రం**(1971) కేసులో కూడా సుప్రీంకోర్టు ఈ దృక్పథాన్నే కొనసాగించింది. మద్రాసు ప్రభుత్వం రాష్ట్రాన్ని 6 జోన్స్‌గా విభజించి ఏ జోన్‌వారు ఆ జోన్‌లోనే అడ్మిషన్ పొందాలంటూ ప్రతిజోన్‌లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కల్పించింది. రాష్ట్రప్రభుత్వం రాష్ట్రాన్ని జోన్స్‌గా విభజించడాన్ని కోర్టు కొట్టివేసింది. అయితే వెనుకబడిన తరగతులకు కల్పించిన రిజర్వేషన్లను ఆమోదించింది. యోగ్యులైన, సమర్థులైన విద్యార్థులకు కాలేజీల్లో అడ్మిషన్లు నిరోధించడం తాత్కాలికంగా జాతి ప్రయోజనాలకు నష్టాన్ని కలిగించవచ్చును. అయితే ఏ సహాయంలేకుండా కొంత మందీ అభివృద్ధి చెందిన సెక్షన్లతో పోటీపడలేరు. అభివృద్ధి చెందిన వర్గాలతో సమాన స్థాయికి వెనుకబడినవర్గాలు చేరుకొన్నప్పుడే జాతి దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరుతాయి. అందుకుగాను ఈ దేశంలోని సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కల్పించడం అవసరం. అయితే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలు మాత్రమే ఆర్టికల్ 15 (4) ననుసరించి వెనుకబడిన కులాలవుతాయి.

**యస్.వి. బలరామ్ వర్సెస్ ఆంధ్రప్రదేశ్** కేసులో (1972) కూడా ఈ అభిప్రాయాన్నే మరింత బలంగా వ్యక్తం చేసింది. ఈ కేసులో ఇచ్చిన తీర్పులో కోర్టు, సర్వేలో ఒక కులం మొత్తం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడినట్లయితే, అందులో కొందరు అభివృద్ధి చెందినప్పటికీ, ఆ కులం మొత్తానికి రిజర్వేషన్‌కల్పించడం సమర్థనీయమని అభిప్రాయ పడింది. (If after collecting the necessary data it is found that caste as a whole is socially and educationally backward, in our opinion the reservation made for such persons will have to be upheld not with standing the fact that a few individuals in that group may be both socially and educationally above the average)

**కె.ఎస్. జయశ్రీ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ** కేసులో కూడా దాదాపు ఇదే అభిప్రాయాన్ని కోర్టు వెలిబుచ్చింది. కేరళలో ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించడంలో కులాన్ని, ఆర్థిక స్థోమతను రెండింటినీ పరిగణనలోనికి తీసుకొన్నది. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం వెనుకబడిన కులాల్లో నిర్ణీత ఆదాయనికంటే తక్కువ ఆదాయం గలవారికే రిజర్వేషన్లు కల్పించారు. ఆర్థిక వెనుకబాటుతనాన్ని పరిగణనలోనికి తీసుకోవడం సరైనది కాదని కోర్టులో దాఖలైన పిటిషన్‌ని డివిజన్ బెంచి తోసిపుచ్చుతూ సామాజిక వెనుకబాటుతనానికి బీదరికం దోహదం చేస్తుంది కనుక ప్రభుత్వ ఉత్తర్వు సరైనదేనని తీర్పునిచ్చింది. అయితే సామాజిక వెనుకబాటుతనం అంచనా వేయడంలో కేవలం బీదరికాన్నే ప్రాతిపదికగా తీసుకోగూడదని కోర్టు అభిప్రాయపడింది.

**చోటేలాల్ అండ్ అదర్స్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్** కేసులో సుప్రీంకోర్టు పైన పేర్కొన్న అభిప్రాయాన్ని పునరుద్ఘాటించింది.

ఈ తీర్పులను పరిశీలిస్తే కోర్టు తీర్పుల్లో క్రమానుగతంగా

రిజర్వేషన్ల పట్ల కొన్ని అభిప్రాయాలు చాలా బలంగా ముందుకు వచ్చాయి. కోర్టుల అభిప్రాయాల్లో కొన్ని ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి.

1. కోర్టుల దృష్టిలో సమానత్వపు హక్కుకు ఆర్టికల్ 15 (4) ఒక పరిమితి మాత్రమే. అంటే కుల, మత, లింగ, ప్రాంత విచక్షణ లేకుండా మనుషులందరినీ సమానంగా చూడాలన్న సమానత్వపు హక్కుకు వెనుకబడిన వర్గాలు, షెడ్యూల్డ్ కులాలు మరియు తెగలకు ప్రత్యేక రాయితీలు కల్పించవచ్చునన్న 15 (4) ఆర్టికల్‌ను కోర్టులు ఒక పరిమితిగా చూస్తున్నాయి.

2. ఒక హక్కుపై విధించే పరిమితి, హక్కును హరించేదిగా కాక హేతుబద్ధంగా ఉండాలన్న సూత్రాన్ని కోర్టులు రిజర్వేషన్లకు విస్తరిస్తున్నాయి. కనుకనే రిజర్వేషన్లు 50% దాటకూడదన్న నిబంధనను కోర్టులు విధించాయి.

3. ఒక హక్కుపై పరిమితి విధిస్తున్నప్పుడు ఆ పరిమితి రాజ్యాంగాన్ననుసరించి ఉన్నదో లేదో చూడటమే కోర్టులు తమ కర్తవ్యంగా ఎంచుకొన్నాయి. రాజ్యాంగాన్ననుసరించి రిజర్వేషన్లు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకే కల్పించాలి కనుక ప్రభుత్వం పై రెండు అంశాలను దృష్టిలో ఉంచుకుందో లేదో తేల్చుకోవడమే తమ కర్తవ్యంగా కోర్టులు భావిస్తున్నాయి.

4. అయితే సామాజిక వెనుకబాటుతనాన్ని మదింపు వేయడంలో కులాన్ని ఒకానొక అంశంగా మాత్రమే కోర్టులు గుర్తించాయి. సామాజిక వెనుకబాటుతనాన్ని గుర్తించడంలో కులం ప్రధానమైన లేక ఏకైక ప్రాతిపదిక కాకూడదన్నది కోర్టుల అభిమతం. రాజ్యాంగం తరగతి అనే మాట వాడింది. కానీ కులం అనేమాటను వాడలేదు కనుక కోర్టు ఈ నిర్ధారణకు వచ్చింది.

ఈ అంశాలను పరిశీలించినప్పుడు కోర్టుల వైఖరిలో రెండు ప్రధాన లోపాలు కనబడతాయి. కోర్టులు 15(4) ఆర్టికల్‌ను సమానత్వపు హక్కుకు ఒక పరిమితిగా చూడడం మొదటి లోపం. ఆర్టికల్ 15 (4) ను సమానత్వపు హక్కుకు వివరణగా చూడాలి. ఎందుకంటే అసమానులను సమానులుగా పరిగణించడం వలన సమాజంలో అసమానత పటిష్ట మవుతుంది తప్పసమసిపోదు. బలవంతులను, బలహీనులను ఒకే గాటన కట్టడంవలన బలవంతుల ఆధిపత్యం నిలబడుతుంది. బలవంతుల ప్రత్యేక ప్రతిపత్తి కొనసాగుతుంది. చట్టం దృష్టిలో అందరూ సమానులేనన్న సూత్రం మిధ్యగా మిగిలిపోతుంది. అలాకాక అందరూ సమానంగా పరిగణించబడాలంటే బలహీనులకు బలవంతులతో సమానంగా అవకాశాలను ఉపయోగించుకోవటానికి చేయూతనివ్వాలి. అంటే బలహీనులకు చేయూతనివ్వడం వలన వారు బలవంతులతో సమానంగా వికాసం చెందగలుగుతారు కనుక ప్రత్యేక రాయితీలను కల్పించడం సమానత్వపు హక్కుకు పరిమితం కాదు; సమానత్వపు హక్కును విస్తృత పర్చడం కోసం, అందరికీ అందుబాటులో తేవడం కోసం జరిగే ప్రయత్నం అది.

ఈ ప్రధాన ప్రాధమిక సూత్రాన్ని కోర్టులు విస్మరించడానికి కారణం వారికి చారిత్రక దృక్పథం లేకపోవడమే. రాజ్యాంగాన్ని కోర్టులు ఒక పరిమితమైన, సంకుచితమైన లీగల్ దృక్పధాన్నుంచే చూస్తున్నాయి. నిర్దిష్టమైన చారిత్రక క్రమంలో రూపొందింది రాజ్యాంగం. ఈ రాజ్యాంగం ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయాన్ని సాధించే ఒక సాధనంగా రూపుదిద్దుకుంది. భారతదేశంలో సామాజిక, రాజకీయ న్యాయాన్ని కల్పించడం కోసం రిజర్వేషన్లు ఒకానొక సాధనం.

రిజర్వేషన్లు కల్పించడం కోసం కులం తప్ప వేరొక ప్రాతిపదికలేదు. ఎందుకంటే కులం సామాజిక అసమానతలకు దారితీసింది. కులం కొంత మందిని రాజ్యయంత్రాంగ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ఆటంక పర్చింది. కొంతమంది వ్యక్తులు ఆర్థికంగా అభివృద్ధి చెంది సామాజికంగా, రాజకీయంగా పెత్తనం చెలాయించడానికి కులం దోహదం చేసింది. ఇటువంటి సమాజంలో సామాజిక వెనుకబాటుతనాన్ని అంచనా వేయడంలో కులానికి మించిన ప్రాతిపదిక లేదు. అయినా కులాన్ని ఒకనొక ప్రాతిపదిక అంటున్నారంటే మన కోర్టువారు కులాన్ని విస్మరిస్తున్నట్లే లెక్క. నిజానికి రాజ్యాంగం ఆర్థిక వెనుకబాటుతనం అని వాడిఉంటే మార్క్సిస్టు పరిభాషలో వర్గానికి పర్యాయ పదంగా వాడారని చెప్పవచ్చు. కానీ ఆర్థిక వెనుకబాటుతనం కాక సామాజిక వెనుకబాటుతనం అన్న మాటలను రాజ్యాంగంలో వాడారు. ఈ మాటలను కులాన్ని దృష్టిలో ఉంచుకొనే ఉపయోగించారు. ఎందుకంటే కులం తప్ప సామాజిక వెనుకబాటుతనాన్ని నిర్ణయించడానికి భారతదేశంలోని ప్రత్యేక పరిస్థితుల్లో వేరొక ప్రాతిపదికలేదు. ఒక కులం వెనుకబడింది అంటే అది ఆర్థికంగా కూడా వెనుకబడినట్లే లెక్క. కొంతమంది అగ్రవర్ణాల సేవ చేయడం నిమ్నకులాల కర్తవ్యంగా ధర్మశాస్త్రాలు గుర్తించాయి. ఆ శాస్త్రం తోనే కుల వ్యవస్థనూ కాపాడుతున్నాయి. అందుకే వెనుకబడిన కులాలన్నీ ఆర్థికంగా కూడా వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్నాయి. అక్కడక్కడా అభివృద్ధి చెందిన అగ్రవర్ణాలు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి వెనుకబడిన తరగతులుగా గుర్తింపు పొంది రాయితీలు పొందే ప్రయత్నం చేయవచ్చు. అయితే అటువంటి ఘటనలు చాలా తక్కువ. చాలా రాష్ట్రాల్లో అసలు లేవు. ఈ సామాజిక వాస్తవాన్ని విస్మరించడం వల్లనే కోర్టులు ఆర్టికల్ 15 (4) కు సమానత్వపు హక్కుకు గల సంబంధాన్ని అర్థం చేసుకోవడంలేదు. కులవ్యవస్థను మన సమాజంలో ఒక అంతర్భాగంగా గుర్తించనంతకాలం, ఇప్పటికీ కులవ్యవస్థ కొంతమంది ఆధిపత్యానికి దోహదం చేస్తున్నదన్న విషయాన్ని విస్మరించినంత కాలం భారతదేశంలో ప్రజాస్వామిక సమాజాన్ని నిర్మించడం కష్టం.

కనుక సమస్య కొంత మందికి రాయితీలు ఇవ్వాలా, వద్దా అన్నది కాదు. మనదేశంలో ప్రజాస్వామిక వ్యవస్థ పటిష్టం కావటానికి ముందుగా ప్రజాస్వామిక సమాజాన్ని రూపొందించాలా వద్దా అన్నదే. ప్రజాస్వామిక సామాజిక వ్యవస్థను రూపొందించాలంటే కులవ్యవస్థను నిర్మూలించాలి. కుల నిర్మూలనకు రిజర్వేషన్లు ఒక సాధనం. అందుకే రిజర్వేషన్ల పరిరక్షణను ప్రజాస్వామిక వ్యవస్థను పటిష్టం చేయడానికి జరిగే ప్రయత్నంలో భాగంగా చూడాలి.

మరి ఈ దృక్పథం ఈ రోజు కోర్టులకు లేదు. మన మధ్యతరగతి మేధావులకూ లేదు. అందువల్లనే రిజర్వేషన్లు ప్రకటించిన ప్రతిసారీ కోర్టుల్లో లిటిగేషను సాగుతుంది. కోర్టుల్లో జరిగే పండిత ప్రకర్షల్లో సామాజిక వాస్తవాలు పరిగణనలోనికి రావడంలేదు. అందువల్లనే ప్రతిరాష్ట్రంలోనూ రిజర్వేషన్ల అమలులో కోర్టు లిటిగేషన్ వలన జాప్యం జరుగుతుంది. ఈ సమస్యను నిరోధించడానికి రాజ్యాంగాన్ని సవరించి వెనుకబడిన కులాలు అనేమాటను వాడటం చాలా అవసరం.